క్లుప్తంగా

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి

మోమిన్‌పేట: ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆశీస్సులతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మేకవనంపల్లిలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.15లక్షల నిధులతో సీసీ నిర్మాణ పనుల చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలి



పరీక్ష ప్యాడ్లతో పదో తరగతి విద్యార్థులు

బంట్వారం: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని కోట్‌పల్లి సర్పంచ్ నక్కల విజయ లక్ష్మీ అన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పంపిణీ చేసిన పరీక్ష ప్యాడ్‌లను సోమవారం ఆమె స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని, ప్రశాంత వాతావరణంలో ఏకాగ్రతతో చదివితే పాఠాలు బాగా గుర్తుంటాయని తెలిపారు. పాఠ్యాంశాల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ యాదగిరి, మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బందెయ్య, ఉప సర్పంచ్ రియాజ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొడంగల్ రూరల్: హస్నాబాద్ జీసీపీఎస్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు ఉత్సాహంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన స్టూడెంట్స్‌కు ఉపాధ్యాయ సిబ్బంది బహుమతులు ప్రదానం చేశారు.

'ఆత్మరక్షణకు కరాటే అవసరం'



విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్

కొడంగల్ రూరల్: ఆత్మరక్షణకు, మానసిక ప్రశాంతతకు కరాటే తోడ్పతుందని తైక్వాండో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాస్టర్ హెచ్.మనోహర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కరాటే పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే విద్యతోపాటు యోగా, కరాటేలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. తైక్వాండో కరాటే జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కొత్త ఫోన్ నంబర్లు

కుల్కచర్ల: ఫీల్డ్ అసిస్టెంట్లకు కొత్త ఫోన్ నంబర్లను కేటాయిస్తున్నట్లు ఏపీఓ వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో సిమ్ కార్డులను అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నంబర్లు మారిన విషయాన్ని మండల ప్రజలు గమనించాలని, వారిని సంప్రదించేందుకు గ్రామపంచాయతీ లేదా ఉపాధిహామీ కార్యాలయంలో ఆ నంబర్లను తెలుసుకోవాలని ఏపీఓ సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'

పూడూరు: అంధత్వ నివారణకు సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ మల్లేశం అన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్నేగూడలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేత్ర శిబిరంలో ప్రజలకు కంటి పరీక్ష చేసి, ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇస్తున్నామని తెలిపారు. గ్రామంలో వారం రోజుల పాటు సాగే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్నెళ్లుగా అందని నిధులు

పాలకులు, అధికారుల సమన్వయలోపంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోందని బహిరంగంగా విమర్శలు వినవస్తున్నాయి. పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారుస్తున్నామని పాలకులు చెబుతున్నా.. నిధుల లేమితో ఆ కార్యక్రమం ప్రశ్నార్థకంగా మారిందని స్థానిక ప్రజాప్రతినిధులే వాపోవడం గమనార్హం.

- కుంటుపడుతున్న జీపీల అభివృద్ధి
- ఇబ్బందుల్లో పాలకవర్గాలు
- పంచాయతీల నిర్వహణపై చేతులెత్తేస్తున్న సర్పంచులు!



దేవర్‌ఫసల్‌వాద్ గ్రామపంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: గ్రామపంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లెప్రగతి కార్యక్రమం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. నెలనెలా నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీల పాలన ప్రశ్నార్థకంగా మారింది. దీంతో చేతిలో చిల్లి గవ్వలేక.. ప్రజల్లో తిరగలేక ముఖం చాటేయడం పల్లె ప్రథమ పౌరుల వంతయింది. ప్రతి నెల ఎంపీ డబ్ల్యూల వేతనాలు, కరెంటు బిల్లులు, పంచాయతీ ట్రాక్టర్ల కిస్తుల చెల్లింపుతో పాటు ట్రాక్టర్ నిర్వహణకు కొంత మొత్తాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు (ఎస్‌ఎఫ్‌సీ) ఆరు నెలలుగా విడుదల చేయడంలేదు. జనరల్ ఫండ్‌ను వినియోగించుకునేందుకు జారీ చేసిన చెక్కులు నెలల తరబడి పాస్‌కావడంలేదు. ఖాతాల్లో ఉన్న ఎస్‌ఎఫ్‌సీ నిధులు వినియోగించుకుందామంటే చెక్కులు జనరేట్ కావడంలేదు. దీంతో పంచాయతీల నిర్వహణ సర్పంచులు, పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎస్‌ఎఫ్‌సీ నిధులతో కాలం వెళ్లదీత..

మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కొద్దిపాటిగా వస్తున్న 15వ ఆర్థిక సంఘం ఎస్‌ఎఫ్‌సీ నిధులతో పంచాయతీ పాలకవర్గం కాలం వెళ్లదీస్తోంది. నెలనెలా ఎస్‌ఎఫ్‌సీ నిధులు సక్రమంగా మంజూరు కావడంలేదు. ఉన్న నిధులు ఖర్చు చేద్దామంటే చెక్కులు జనరేట్ కాని పరిస్థితి. జనరల్ ఫండ్‌కు సంబంధించిన చెక్కులు కూడా పాస్ కావడంలేదు. కొన్ని చోట్ల మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాల చెల్లింపుల్లో ఆలస్యమవుతోంది. పైగా పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణ తలకు మించిన భారమవుతుందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీల అభివృద్ధికి సంబంధించి ఎస్‌ఎఫ్‌సీ నిధులు నెలనెలా జమ చేయాలని కోరుతున్నారు. నిధులు ఖర్చు చేసుకునేందుకు జారీ చేసిన చెక్కులు పాస్ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

"చాలా ఇబ్బంది అవుతోంది



పంచాయతీల నిర్వహణకు ప్రభుత్వం నెలల తరబడి నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ట్రాక్టర్ల నిర్వహణ, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపునకు చాలా కష్టమవుతోంది. పంచాయతీ పాలన భారమవుతోంది. నెలనెలా నిధులు విడుదల చేయాలి. ఉన్న నిధులు ఖర్చు చేసుకునేందుకు జారీ చేసిన చెక్కులు పాసయ్యేలా చూడాలి.

– మల్లీశ్వరి, సర్పంచ్, దేవర్‌ఫసల్‌వాద్

యూనిట్లతో ఉపాధి పొందాలి

లబ్ధిదారులతో ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: లబ్ధిదారులు తప్పని సరిగా యూనిట్లను ఏర్పాటు చేసుకొని, ఉపాధి పొందాలని ఎంపీడీఓ శైలజారెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్, వికలాంగుల రుణ లబ్ధిదారుల ఎంపిక కొరకు ఇంటర్వ్యూలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనార్టీ కార్పొరేషన్ రుణాల కొరకు 220 మంది దరఖాస్తు చేసుకోగా.. 6 యూనిట్లకు లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. మోమిన్‌పేటకు మూడు, టేకులపల్లికి ఒకరు, మిగతా రెండు యూనిట్లు అన్ని గ్రామాలకు కేటాయించినట్లు ఆమె వెల్లడించారు. వికలాంగుల రుణ లబ్ధిదారులకు ఒక యూనిట్ మంజూరైందని, ఆరు దరఖాస్తులు రాగా ఒకరిని ఎంపిక చేశామని చెప్పారు. రుణాల కొరకు ఎంపికైన లబ్ధిదారులు యూనిట్లను నెలకొల్పుకొని ఉపాధి పొందాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న ఎంపీడీఓ

లబ్ధిదారుల ఎంపిక

పూడూరు: మైనార్టీకార్పొరేషన్ ద్వారా రుణాల కోసం లాటరీ పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేశామని ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీపీ మల్లేశం తెలిపారు. మండలంలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 18 యూనిట్లకు గాను రూ.24 లక్షలు మంజూరయ్యాయని, దీనికి గాను 377 మంది లబ్ధిదారులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారు చెప్పారు. అందులో 18 మందిని ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ వెల్లడించారు. జెడ్పీటీసీ మేఘమాల, మండల కో ఆప్షన్ సభ్యుడు అయూబ్ పాల్గొన్నారు.

'పేస్కేలుతో గుర్తించిన ప్రభుత్వం'



అనంతగిరి: కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్, సెర్ప్ ఉద్యోగులు

యాలాల: సెర్ప్ ఉద్యోగులకు పేస్కేలు ప్రకారం వేతనాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఐకేపీ ఏపీఎం ప్రమీల అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఐకేపీ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పేస్కేలుతో గుర్తించడం ఎంతో సంతోషంగా ఉందని, జీఓ 11 ప్రకారం ఇక నుంచి పేస్కేలు అమలవుతుండడం ఆనందంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో సీసీలు నర్సింహులు, బందెప్ప, వెంకటయ్య, గోనమ్మ, కృష్ణయ్య, బీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

అనంతగిరి: సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీఓ 11 ద్వారా పే స్కేలు అమలవుతున్న సందర్భంగా.. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం సెర్ప్ ఉద్యోగులు కేక్ కట్‌చేసి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



పరిగి: నిరసన దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలి
- బీజేపీ నిరసన దీక్షలో ఆ పార్టీ నేతలు
- మంత్రి కేటీఆర్ రాజీనామాకు కమలనాథుల డిమాండ్

కొడంగల్ రూరల్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నర్సింహులు, నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షుడు మదన్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో వారు మాట్లాడారు. నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలు రాస్తే, లీకేజీ వ్యవహారంతో ఏట్లో చింతపండు పిసికిన చందంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ.. మంత్రి కేటీఆర్ తక్షణమే రాజీనామా చేయాలని, లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పున్నం చంద్‌లాహోటీ, రాష్ట్ర కిసాన్‌మోర్చా అధికార ప్రతినిధి కూర వెంకటయ్య, రాష్ట్ర ట్రైనింగ్ సెల్ కో కన్వీనర్ రమేష్, జిల్లా కార్యదర్శి చంద్రప్ప, పార్టీ నాయకులు రాము, మోహన్‌రావు, బంద్యప్ప, రాములు, వెంకటేశ్, శ్రీను, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం

పరిగి: గ్రూప్1 పేపర్ లీక్‌తో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని, లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలో వారు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆరోపించారు. నిరుద్యోగుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటయ్య, నరసింహ, అంజన్‌యాదవ్, పెంటయ్యగుప్తా, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం

తాండూరు రూరల్: కంటి వైద్యుల సేవలు అభినందనీయమని కోటబాసుపల్లి సర్పంచ్ కుర్వ నాగర్జున అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కంటివెలుగు కార్యక్రమం ముగించుకొని వెళ్తున్న డాక్టర్, సిబ్బందికి శాలువ, పూలమాలతో సన్మానించి మాట్లాడారు. పక్షం రోజులుగా గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు చేసిన వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కంటివెలుగు పేదలకు ఎంతో ఉపయోగంగా ఉందని, ఉచితంగా కంటి పరీక్ష చేసి, అద్దాలు పంపిణీ చేశామని చెప్పారు. డాక్టర్ రశీద్, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, నాయకులు వెంకట్రాంరెడ్డి, మొగులప్ప, రామ్‌శెట్టి, నర్సప్ప, లక్ష్మి, సావిత్రమ్మ, లావణ్య, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు ఉన్నారు.

23న అభ్యర్థుల ఎంపిక

కొడంగల్ రూరల్: టీఎస్‌ఎంఈఎస్–ఎకనామికల్ సపోర్టు స్కీం 2022–23 సంవత్సరానికి సంబంధించి రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 23వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పాండు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గురువారం ఉదయం 11గంటలలోపు సంబంధిత పత్రాలతో రావాలని వెల్లడించారు.

ధ్రువ పత్రాలతో రావాలి..

తాండూరు రూరల్: మైనార్టీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ముఖాముఖి నిర్వహిస్తామని ప్రకటించారు. మీసేవలో దరఖాస్తు చేసుకున్న ఆన్‌లైన్ ఫారం, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు వంటి అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని వెల్లడించారు.

ధారూరులో

ధారూరు: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక ఈనెల 23న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో జరుగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–23 సంవత్సరానికై .. ధారూరు, నాగసమందర్ ఎస్‌బీఐ బ్యాంకుల పరిధిలోని గ్రామాల వారికి, నాగారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆ బ్యాంకు పరిధిలోని దరఖాస్తు దారులకు లాటరీ పద్ధతిలోనే ఎంపిక జరుగుతుందని తెలిపారు. రూ.లక్ష యూనిట్లు ధారూరుకు 4, నాగారం, నాగసమందర్ బ్యాంకుల పరిధిలోని వారికి 2 చొప్పున కేటాయించడం జరిగిందని చెప్పారు. ఎంపిక ప్రక్రియ ఎంపీడీఓ, ఎంపీఓ, బ్యాంకు మేనేజర్లు, ఐకేపీ ఏపీఎంల సమక్షంలో జరుగుతుందని ప్రకటించారు.

గ్రామ స్వచ్ఛతకు ప్రాధాన్యత

కుల్కచర్ల: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ సౌమ్యారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్మించనున్న మురుగుకాల్వల స్థలాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. మురుగుకాల్వలు, సీసీరోడ్ల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతామని, గ్రామాన్ని ఆహ్లాదకరంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. అనంతరం జీపీ కార్యాలయంలో ఏర్పాటు గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ఆరు బయట చెత్త వేయకుండా.. గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, పిచ్చిమొక్కలను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాండు రంగాచారి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిలో పన్నులే కీలకం

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు కాలనీల్లో పన్నులు వసూలు చేసి, తన సొంత ఇంటి పన్ను చెల్లించి మాట్లాడారు. పట్టణ అభివృద్ధిలో పన్నులు చాలా కీలకమని, పన్ను చెల్లింపు విషయంలో అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవిందరావు అన్నారు. పట్టణ కేంద్రంలోని నంబర్1, నస్కల్ తదితర గ్రామాల్లో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా ఎగ్జామ్ ప్యాడ్‌లను విద్యార్థులకు అందజేసి మాట్లాడారు.



ఇంటి పన్ను చెల్లిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

ఎంపీ విద్యార్థుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. కావున విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాగేశ్వర్, కృష్ణ, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం



బాలల సంరక్షణపై మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటయ్య తదితరులు

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత: సర్పంచ్

పరిగి: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సర్పంచ్ వెంకటయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిగురాల్‌పల్లి గ్రామంలో బాలల హక్కుల రక్షణ సంరక్షణపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలలకు ఎలాంటి ఇబ్బందులున్నా.. వారి సంరక్షణ కోసం చైల్డ్‌లైన్ నంబర్ 1098 ఏర్పాటు చేశారని, ఆ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. చిన్నారులను పనిలో పెట్టుకోవడం నేరమని, బాల్య వివాహాలు చేయడం వలన అనేక అనర్థాలు జరుగుతాయని చెప్పారు. వాటి వల్ల కలిగే నష్టాల గురించి ఆయన వివరించారు. గ్రామాల్లో బాలికలు వేధింపులకు గురవుతున్నారని, వారిని ఇబ్బందులకు గురిచేస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. వారికి ఎక్కడ అన్యాయం జరిగినా.. వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్లు శ్రీనివాస్, రాములు, వెంకటేశ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అంచనాలే తప్ప.. ఆదుకోవడం లేదు

- పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- ప్రతి ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి
- మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ డిమాండ్

మోమిన్‌పేట: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని సయ్యద్‌అల్లిపూర్, పల్లేగుట్టతండాల్లో వడగళ్ల వానకు నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అధికారులతో అంచనాలు వేయించడమే తప్ప.. రైతులకు ఎలాంటి హామీ ఇవ్వడం లేదని, నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలన్నారు. వర్షాల వలన రైతులు నష్టపోతే.. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వడం లేదని, కేవలం ప్రగతిభవన్‌కే పరిమితమయ్యారని ఆయన ఆరోపించారు. నష్టపోయిన పంటకు పరిహారంతో పాటు.. ఇళ్లు పాడైన రైతులకు డబుల్ బెడ్‌రూం ఇవ్వాలని మాజీ మంత్రి కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు సుభాష్‌యాదవ్, సురేందర్, ఎజాస్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



అరటి తోటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

మజీద్ వద్ద శానిటైజేషన్ చేయించాలి



మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

మున్సిపల్ కమిషనర్‌కు మైనార్టీ నాయకుల విన్నపం

కొడంగల్ రూరల్: రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని మజీద్‌ల వద్ద శానిటైజేషన్ చేయించాలని ముస్లిం మైనార్టీ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 23 నుంచి రంజాన్ ప్రారంభం కానుందని, ముస్లింలకు ఇబ్బంది కలగకుండా ప్రార్థనాలయాల పరిసరప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్.. వెంటనే పనులు చేపట్టాలని పుర సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం విద్యుత్ కోతల్లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, మాజీ ఉప సర్పంచ్ ఎస్‌ఎం.గౌసన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పూడూరు: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మాజీ వైస్ ఎంపీపీ మాణిక్యంగౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కడుమూరు, సిరిగాయపల్లి తదితర గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్ల పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో అవసరం ఉన్నచోట్ల సీసీరోడ్లు, సైడ్‌డ్రైన్‌లతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, నాయకులు వెంకట్‌దాసు, యాదయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: టమాటా పంటను పరిశీలిస్తున్న ఏఈఓ అనిల్‌కుమార్ తదితరులు

పరిహారం అందేలా చూడండిసారూ..

అనంతగిరి: వడగళ్ల వర్షానికి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ జరిగిన నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించేలా చూడాలని పలువురు రైతులు వ్యవసాయ అధికారికి విన్నవించారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

కుల్కచర్ల: అకాల వర్షాలకు చాకల్‌పల్లి, కొత్తపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వీరస్వామి మాట్లాడుతూ.. వర్షాల వలన కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామాల్లో పంట పొలాలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు, పంటల వివరాలు సేకరించి జిల్లా అధికారులకు నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.